# భారత్-అమెరికా అణు ఒప్పందం... ద్వైపాక్షిక సంబంధాలు..!

భారత్–అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేసే దిశగా ఇరుదేశాల మధ్య కుదిరిన అణు ఒప్పందం.. దేశంలోని రాజకీయ వ్యవస్థను.. అణు ఒప్పందం సమర్థించేవారు, వ్యతిరేకించే వారుగా...రెండు గ్రూపులుగా విభజించివేయడంతో మళ్లీ వార్తల్లోకి ఎక్కింది. ఇరుదేశాల ప్రభుత్వాలకు ప్రతిష్టాత్మకంగా మారిన ఈ అణు ఒప్పందం...పార్లమెంటులో చర్చకు రావడంతో రాజకీయ పక్షాల మధ్య విభజన మొదలైంది. వాస్తవానికి కేంద్ర కేబినెట్‌కు ఒప్పందాన్ని ఖరారు చేసే అధికారం ఉంది. అయితే విదేశాంగ విధానంపై అన్ని రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకు రావాలనే ప్రజాస్వామ్య పరంపరను కొనసాగిస్తూ...ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని పార్లమెంటులో చర్చించి, ఆమోదం పొందాలని ప్రయత్నించడంతో ఈ సమస్య మొదలైంది. 2005, జులైలో భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్, అమెరికాలో పర్యటన జరిపారు. ఆ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇరుదేశాల మధ్య అణు శక్తిని శాంతియుత ప్రయోజనాలకు వాడే విషయంపై పరస్పరం సహకరించుకోవడానికి అంగీకరించారు. భారతదేశంలో ఇంధన వనరులు నానాటికీ తగ్గిపోతుండడం.. జనాభా పెరిగి పోతుండడం.. విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చడానికి దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ శక్తి సరిపోకపోవడం.. పర్యావరణ పరంగా, ఆర్థిక పరంగా థర్మల్ విద్యుత్ శక్తి కంటే శుభ్రమైందిగా, చౌకయినదిగా..అనేక ఐరోపా దేశాలలో విద్యుత్ శక్తి అవసరాలను తీరుస్తున్న అణు విద్యుత్ శక్తి ఉత్పాదనకు భారత్‌కు సహకరించడానికి అమెరికా ముందుకు రావడం.. భారత్ దానికి అంగీకరించడంతో, రెండు దేశాల మధ్య అణు ఒప్పందానికి నాంది పలికింది. ఈ ఒప్పందంతో అంతర్జాతీయ సమాజంలో అణుశక్తి విషయంలో భారత్ ఎదుర్కొంటున్న అంటరానితనానికి ముగింపు పలికే అవకాశం ఏర్పడింది. ఈ ఒప్పందం ఇరు దేశాలలో ఆమోదం పొంది, అమలైతే భారత్, అమెరికాల మధ్య వ్యూహాత్మక సంబంధం మరింత సుదృఢమయ్యే అవకాశం ఉంది. ఇరుదేశాలనూ గెలుపు–గెలుపు స్థితిలో ఉంచేదిగా అభివర్ణించిన ఈ అణు ఒప్పందం.. అమల్లోకి రావాలంటే భారత పార్లమెంటు, అమెరికా కాంగ్రెస్‌ల ఆమోదంతోపాటు అంతర్జాతీయ అణు సంస్థ (International Atomic Energy Agency , IAEA), అణు సరఫరా సమూహం (Nuclear Suppliers Group NSG)లతో భారత్ చర్చలు ఫలప్రదంగా ముగియాలి. IAEA, NSGలతో చర్చలు ఫలప్రదంగా ముగిస్తే.. అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం పొంది, ఒప్పందం అమెరికాలో ఒక చట్టంగా మారేందుకు వీలవుతుంది. 2006, మార్చిలో ఢిల్లీలో భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్ , అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు.

భారత ఇంధన అవసరాలను తీరుస్తూ, భారత్‌లో పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతుల అవసరాలను తగ్గించగలిగితేదాని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపైనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందని..పెట్రోలియం ముడి పదార్థాల డిమాండ్ తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గవచ్చని కూడా ఈ ఒప్పందం ఒక ఉద్దేశం. ఈ ఒప్పందానికి చట్టబద్ధతను కల్పించే దిశగా రూపొందించిన (Hyde) హైడ్ చట్టాన్ని అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభలు (House of Representatives, Senate) ఆమోదించాయి. 2007, డిసెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ కూడా దీనిపై సంతకం చేశారు. ఈ చట్టంపై చర్చ జరిగినప్పుడు అమెరికన్ పార్లమెంటులోని రెండు సభలు భారీమెజారిటీతో ఆమోదించినా... భారత స్వతంత్ర అణు కార్యక్రమాన్ని నియంత్రించే దిశగా కొన్ని సవరణలు చేయడం జరిగింది. అయితే, అమెరికా రాజ్యాంగం ప్రకారం... అమెరికా విదేశాంగ విధానాన్ని నిర్ధారించే నిర్ణయాత్మక అధికారం అధ్యక్షుడికి ఉంటుందని... భారత్‌ను ఇబ్బంది పెట్టేవిగా ఉన్న Hyde చట్టంలోని సెక్షన్ 103, 104 ....D2 అధ్యక్షుడికి అమెరికన్ కాంగ్రెస్ ఇచ్చిన సలహా మాత్రమేనని జార్జిబుష్ ప్రకటించారు. అంతేకాకుండా భారత్‌కు ప్రతికూలంగా ఉన్న కొన్ని పదాలను Hyde చట్టంలో సవరణచేయడంతో ఒప్పందం అమలుకు అమెరికా వైపు నుంచి మార్గం సులభమైంది.

## హైడ్ (Hyde) చట్టం – 123 ఒప్పందం :

ఇతర దేశాలతో అణుశక్తి సహకారం కోసం అమెరికా పాటించాల్సిన ప్రక్రియ..అమెరికా సంయుక్త రాష్ట్రాల అణుశక్తి చట్టం (1954), సెక్షన్ 123లో స్పష్టంగా ఉంది. అమెరికా, ఇతర దేశాలతో అణు సహకారాన్ని పెంపొందించుకోవాలంటే... సెక్షన్ 123 ప్రకారం ఆ దేశంతో అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంటుంది. దీన్నే 123 ఒప్పందం అంటారు. ఇప్పటి వరకూ అమెరికా, 25 దేశాలతో 123 ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ దేశాల్లో జపాన్, చైనా, స్విట్జర్లాండ్ కూడా ఉన్నాయి. భారతదేశంతో ఇదే విధంగా 123 ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి అవసరమైన న్యాయపరమైన ప్రక్రియాత్మక పునాదిగా రిపబ్లికన్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు హెన్రీ హైడ్ రూపొందించిన చట్టమే ఈ హైడ్ చట్టం. ఇరుదేశాల మధ్య అణుశక్తి ఒప్పందాన్ని అమలు చేయడానికి అవసరమైన ప్రక్రియాత్మక వివరణలు, షరతులు, ఇరుదేశాల బాధ్యతలు మొదలైన వాటి స్పష్టమైన వివరణే హైడ్ చట్టం. అంటే.. 123 ఒప్పందాన్ని అమల్లోకి తేవడానికి అవసరమైన (లీగల్ బేసిస్) ప్రక్రియల వివరణే హైడ్ చట్టం. భారత్‌తో అమెరికా కుదుర్చుకునే ఈ 123 ఒప్పందం..భారత కేబి నెట్, అమెరికా కాంగ్రెస్‌ల తుది ఆమోదం పొందిన తర్వాతనే అమల్లోకి వస్తుంది. అయితే 123 ఒప్పందం అమెరికా పార్లమెంటు ఆమోదానికి వెళ్లే ముందు భారత ప్రభుత్వ ఆమోదం పొందడమే కాక, అణు పదార్థాల సరఫరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై IAEA , NSG లతో ఈ ఒప్పందాన్ని అమలు చేసే దిశగా ఫలప్రదమైన చర్చలు జరపాల్సి ఉంటుంది. IAEAతో చర్చలు జరిపేందుకు భారత ప్రభుత్వం ఆమోదం తెలిపితే కాని సాధ్యం కాదు. అందులో భాగంగానే రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు లెఫ్ట్ పార్టీలు,

భారతీయ జనతా పార్టీల వ్యతిరేకత కారణంగా సఫలం కావడంలేదు.

**అణు ఒప్పందం ముఖ్యాంశాలు :**

- IAEAతో భారతదేశం చర్చలు జరిపి, అణు ఇంధన సరఫరా నిరాటంకంగా సాగేందుకు కావలసిన ఒప్పందం చేసుకోవడంలో భారత్‌కు అమెరికా సాయపడుతుంది.
- భవిష్యత్‌లో తన అవసరాల కోసం కావలసిన అణు ఇంధన నిల్వలను వృద్ధి చేసుకోవడంలో భారత్‌కు అమెరికా సహాయం చేస్తుంది. దీనివల్ల ఒకవేళ భవిష్యత్‌లో ఏదైనా కారణంతో భారత్‌కు అణుఇంధన సరఫరా ఆగిపోతే వ్యూహాత్మక నిల్వలను వృద్ధి చేసుకోవడం ద్వారా ఆ సమస్య నుంచి గట్టెక్కవచ్చు. ఇంధన సరఫరా నిలిచిపోయే పక్షంలో భారత్-అమెరికాలు, రష్యా, ఫ్రాన్స్ లాంటి మిత్రదేశాల నుంచి ఇంధన సరఫరా చేసుకోవటానికి సంయుక్తంగా ఒక మిత్రదేశాల సమూహాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.
- ఇరుదేశాలు తమ తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకొంటూ..వినియోగదారులు,పారిశ్రామిక అవసరాలు తీరే విధంగా, అణు ఇంధన వ్యాపారాన్ని చేసుకొంటాయి.
- అణు ఇంధన తయారీకి అవసరమైన ముడి అణుపదార్థం (Low Enriched Uranium), సాంకేతిక పరిజ్ఞానం,పరికరాలు, తదితరాల సరఫరాలో పరస్పరం సహకరించుకుంటాయి.
- అణు రియాక్టర్ల పరిశోధన, అభివృద్ధి, డిజైన్, నిర్మాణం, క్రియాశీలత, మెయింటెనెన్స్ తదితర విషయాల్లో కూడా అమెరికా భారత్‌కు సహకారాన్ని అందిస్తుంది.
- ఒకవేళ అనివార్య కారణాలవల్ల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని భావిస్తే... రెండు దేశాలు ఆ పరిస్థితులపై పరస్పరం చర్చలు జరిపి, ఇరువురికి ఆమోదయోగ్యంగా ముందుకెళతాయి. అయితే ఒప్పందాన్ని రద్దుచేసుకొనే ముందు ఒక సంవత్సరం ముందస్తు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.
- అమెరికా తన పరపతిని ఉపయోగించి, NSG ద్వారా అంతర్జాతీయ అణు ఇంధన మార్కెట్ నుంచి నిరాటంకంగా అణు ఇంధన సరఫరా జరిగేలా సాయపడుతుంది.
- ఒకవేళ ఒప్పందాన్ని రద్దుచేసుకోవటం వల్ల భారత్‌కు ఏదైనా ఆర్థిక ఇబ్బంది జరిగితే (అణు రియాక్టర్ల తయారీ, విద్యుత్ శక్తి ఉత్పాదన తదితర).. అప్పటి మార్కెట్ విలువ ఆధారంగా భారత్‌కు అమెరికా చెల్లిస్తుంది.
- అణు ఇంధనాన్ని భారతదేశం రీప్రాసెస్ చేయటానికి ఈ ఒప్పందం అనుమతిస్తుంది. అయితే రీప్రాసెసింగ్ సురక్షితంగా జరగటానికి జాతీయ స్థాయిలో కొత్తగా ఒక వ్యవస్థను IAEA మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తారు.
- అతి ముఖ్యమైన మరో అంశం ఏమిటంటే... ఈ ఒప్పందం ఏ దశ లోనూ దేశ రక్షణ కోసం భారతదేశం తయారు చేసుకున్న అణు విధానంతో అనవసర జోక్యం చేసుకోదు.
- ఇరు దేశాలు ఈ ఒప్పందం అమలు చేయటానికి, పరస్పర సహకారాన్ని మరింత వృద్ధి చేసుకోవటానికీ, ఒక సంయుక్త కమి టీని ఏర్పాటు చేసుకుంటాయి.

- సరఫరా చేసిన అణు ఇంధనాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని తిరిగి తీసుకునే హక్కు అమెరికాకు ఉంటుంది.

## ఒప్పందం వల్ల భారత్‌కు లాభాలు:

- పెరుగుతున్న అవసరాలు, తగ్గుతున్న విద్యుత్ శక్తి ఉత్పాదన నేపథ్యంలో.. అణు విద్యుత్ శక్తి ఉత్పాదనను పెంచటానికి ఈ ఒప్పందం ఎంతో తోడ్పడుతుంది.
- కార్బన్ ఇంధనాలపై ఆధారపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ ఇటీవల కాలంలో అత్యధికంగా పెరుగుతున్న చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతోంది. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా అణు ఇంధనానికి పెద్ద పీట వేయాల్సి ఉంటుంది. వచ్చే దశాబ్దానికి 20 వేల మెగావాట్ల అణు విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవటానికి కూడా ఈ ఒప్పందం దోహదం చేస్తుంది.
- కార్బన్ ఇంధనాలపై ఆధారపడటం తగ్గటమే కాకుండా వాతావరణ కాలుష్య స్థాయి కూడా తగ్గుతుంది.
- ఈ ఒప్పందం ద్వారా భారత్-అమెరికా సంబంధాలు వ్యూహాత్మక స్థాయికి చేరుకొనే అవకాశం బలపడుతుంది.
- ప్రపంచ స్థాయిలో అణు విధానం విషయంలో 1998లో జరిపిన అణు పరీక్షల ద్వారా ఏకాకిగా మారిన భారత్‌కు ప్రపంచ దేశాల నుంచి అణు ఇంధన విషయంలో సహకారం లభించే అవకాశం ఏర్పడుతుంది.
- పౌర అణు ఒప్పందం ద్వారా భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధం విషయంలో జరిగే చర్చల్లో భారత్ పట్ల ప్రపంచ దేశాల వైఖరి సానుకూలంగా మారే అవ కాశం ఏర్పడుతుంది.
- ఈ ఒప్పందం కారణంగా దేశభద్రత కోసం భారత్ తనకు తానుగా రూపొందించుకున్న అణ్వస్త్ర ఆధారిత జాతీయ రక్షణ విధానం ఏ రకంగానూ ప్రభావితం కాబోదు. అవసరాన్ని బట్టి తన భద్రతా అవసరాల దృష్ట్యా తన అణ్వస్త్ర సామర్థ్యం విష యంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొనే హక్కు భారత్‌కు ఎప్పుడూ ఉంటుంది.

## భారతదేశ అణు విధానం:

భారతదేశం మొదటి నుంచి అణ్వస్త్రాలకూ, అణ్వస్త్రాల వ్యాప్తికి వ్యతి రేకంగా ఉంది.1954లోనే అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్నిరకాల అణు విస్ఫోటనాలను అంతం చేయాలని ప్రతిపా దించారు. ఈ వాదన బలపడి, 1963లో పాక్షిక అణ్వస్త్ర నిరోధక చట్టం (PTBT) Partial Test Ban Treaty అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం.. వాతావరణంలో నీటి అడుగున, అంతరిక్షంలో అణు పరీక్షలు జరపకూడదని, ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

భారత్ కూడా దీనిపై సంతకం చేసింది. అయితే చైనా, ఫ్రాన్స్‌లు దీనిపై సంతకం చేయలేదు. 1968లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం Non proliferation Treaty (NPT) అమల్లోకి వచ్చింది. NPT ప్రకారం ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యత్వ దేశాలైన అమెరికా, రష్యా, ఫ్రాన్స్, ఇంగ్లండ్, చైనాలు మినహా యించి.. మరే ఇతర దేశం అణు పరీక్షలు జరపరాదని, అణ్వస్త్రాలు కలిగి ఉండరాదని, అణ్వస్త్రాలను వ్యాప్తి చేయరాదని తీర్మానించారు. ఈ ఐదు దేశాలు అప్పటికే ఎన్నో పరీక్షలు జరిపి అణ్వస్త్ర సామర్థ్యాన్ని కూడగట్టుకొని, తమని అణ్వస్త్ర దేశాలుగా ప్రకటించుకుంటూ ...మిగిలిన దేశాలు అణ్వస్త్రాలు కలిగి ఉండకూడదని, వ్యాప్తిని అరికట్టాలని, తీర్మానించిన ఒప్పందంహాస్యాస్పదమే కాక, అణ్వస్త్ర రహిత దేశాల మధ్య వివక్షతను పెంచుతోందని భారత్ ఈ తీర్మానంపై సంతకం చేయలేదు. పైగా భారత్ కోరుకుంటున్న విశ్వ వ్యాప్త సమగ్ర అణ్వస్త్ర పరీక్షల నిరోధాన్ని ఇలాంటి వివక్షపూరిత ఒప్పందం సాధిం చలేదని భారత్ NPTని తిరస్కరించింది. 1974లో శాంతియుత ప్రయోజనాల కోసం పోఖ్రాన్-1 పేరుతో భారత్ అణ్వస్త్ర పరీక్షలు జరిపింది. పొరుగునే ఉన్న చైనా అణ్వస్త్రాలను సమకూర్చుకోవటం, పాకిస్థాన్‌కు రహస్యంగా అణు పరిజ్ఞానాన్ని చేరవేయటంతో... తన రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకోవటానికి ఆత్మరక్షణ కోసం, శాంతి యుత ప్రయోజనాల కోసం భారత్ అణు పరీక్షలు జరిపింది.

1996లో ప్రపంచ దేశాలు సమగ్ర అణ్వస్త్ర నిరోధక చట్టాన్ని (Comprehensive Nuclear Test Ban Treaty - CTBT) అమల్లోకి తీసుకొచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం... అన్నిరకాల అణు పరీక్షలనూ నిరోధించాలన్నది ఈ ఒప్పందం సారాంశం. అయితే, అత్యంత అధునాతనమైన పరిజ్ఞానాన్ని సంపాదించుకున్న ఐదు అణ్వస్త్ర దేశాలు ప్రయోగశాలలో పరీక్షలు జరిపే సామర్థ్యాన్ని పెంచుకొని, ప్రయోగశాలలో జరిపే అణ్వస్త్ర పరీక్షలను ఈ ఒప్పందం నుంచి మినహాయించారు. అంటే.. ఈ ఒప్పందం కూడా భారత్ ఆశించిన విశ్వవ్యాప్త సమగ్ర అణ్వస్త్ర వ్యాప్తి నిరోధానికి దారితీయబోదని.. భారత్ జాతీయ రక్షణ అవసరాలను తీర్చలేదని.. అణ్వస్త్ర దేశాలు, తమ అణ్వాయుధాల పరిజ్ఞానాన్ని, సంఖ్యను మరింత పెంచుకోవటానికి తోడ్పడుతోందంటూ...ఈ వివక్షపూరిత ఒప్పందాన్ని కూడా భారత్ తిరస్కరించింది. 1998లో జాతీయ భద్రతా అవసరాల దృష్ట్యా, మరోసారి అణు పరీక్షలు పోఖ్రాన్-2 జరిపింది. భారత అణ్వస్త్ర విధానం శాంతియుత ప్రయోజనాలను కోసమేనని.. ఏ అణ్వస్త్ర దేశం పైనా తాము మొదటగా అణ్వస్త్రాలు ప్రయోగించబోమని..ఎవరైనా తమపై అణ్వస్త్రాలు ప్రయోగిస్తే, ఆత్మ రక్షణ కోసం తీవ్రస్థాయిలో ప్రతిస్పందిస్తామని..అణ్వస్త్రరహిత దేశాలపై అణ్వస్త్రాలు అసలు ప్రయోగిం చబోమని, తనకు తానుగా అణ్వస్త్ర దేశంగా ప్రకటించుకుంటూ... ఇకపై అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించ బోమని.. అణ్వస్త్రాలు కలిగి ఉన్న దేశంగానే CTBT పై సంతకం చేసే విషయంపై ఆలోచిస్తామని పేర్కొంటూ.. అణ్వస్త్ర ఆధారిత జాతీయ భద్రతా విధానాన్ని భారత్ ప్రకటించింది. ప్రస్తుతం భారత్-అమెరికా పౌర అణు ఒప్పందం వల్ల...భారత్ తనకు తానుగా ప్రకటించుకున్న జాతీయ అణ్వస్త్ర విధానానికి ఎటు వంటి ఇబ్బంది ఉండదు. అంటే.. వ్యూహాత్మక దృక్కోణంతో ఆలోచిస్తే... భారత్ రక్షణ

విధానం, జాతీయ అణ్వస్త్ర విధానం తన అవసరాల ఆధారంగా అణ్వస్త్ర విషయంలో స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం.. భారత-అమెరికా పౌర అణు ఒప్పందం వల్ల ప్రభావితం కాబోవు.

## అణు ఒప్పందానికి వ్యతిరేకత ఎందుకు?

అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు భారత్-అమెరికా పౌర అణు ఒప్పందం ఊతమిచ్చేదిగా ఉందని వామపక్షాల ఆరోపణ. అంతేకాక, భారత్ తన అలీన విదేశాంగ విధానాన్ని అమెరికా ఒత్తిడి వల్ల భవిష్యత్‌లో కొనసాగించలేదని ఆ పార్టీల అభిప్రాయం.

హైడ్ చట్టంలో పొందుపరచిన కొన్ని సెక్షన్‌లు భారత్ స్వతంత్ర అణ్వస్త్ర విధానాన్ని నీరుగార్చే విధంగా ఉన్నాయని...వాటిని మార్చితేగాని ఈ ఒప్పందం భారత్‌కు మేలు చేయదని భారతీయ జనతా పార్టీ అభిప్రాయం. అయితే, హైడ్ చట్టంలో వివాదాస్పదంగా మారిన అంశాలు కేవలం సలహాలాంటివేనని... అమెరికా అధ్యక్షుడు, పార్లమెంటు అభిప్రాయాన్ని కాదని తన స్వతంత్ర నిర్ణయం తీసుకోవచ్చని.. కాబట్టి హైడ్ చట్టం అనేది అమెరికా అంతర్గత వ్యవహారమని, అది అంతర్జాతీయ ఒప్పందమైన 123 ఒప్పందాన్ని అనవసరంగా ప్రభావితం చేయబోదనేది ప్రభుత్వ వాదన!!

## ఐఏఈఏ అంటే...

అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించడానికి.. భిన్న దేశాల మధ్య అణు పరిజ్ఞానాన్ని శాంతియుత ప్రయోజనాలకు పంచుకునే విషయంపై మార్గదర్శకాలను రూపొందించడానికి... అణు పరిజ్ఞానం దురుపయోగంకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల ప్రక్రియను నిర్ధారించుకోవడానికీ... సభ్యదేశాలు ఆ జాగ్రత్తలను పాటిస్తున్నాయోలేదో వెరిఫై చేయడానికి... అణు ఇంధన భద్రతను పరిరక్షించడానికి.. 1981లో ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థగా ఏర్పడిన అంతర్జాతీయ సంస్థే IAEA. ప్రస్తుతం మొహమద్ ఎల్. బరాదీ ఈ సంస్థ డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. ఈయన సేవలకు గుర్తింపుగా 2005లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. అణు పరిజ్ఞానాన్ని సురక్షితమైన, భద్రమైన, శాంతియుతమైన ప్రయోజనాలకు వాడే విధంగా, కృషి చేయడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం.

## ఎన్ఎస్‌జీ అంటే....

1975లో భారతదేశం అణు పరీక్షలు జరిపిన తర్వాత ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య అణు ఇంధన పదార్థాల సరఫరాలను నియంత్రించడానికి..ఆ ఇంధనం అణ్వాయుధాల తయారీ కోసం దురుపయోగం కాకుండా అరికట్టడానికీ..25 దేశాలు 'హేగ్'లో కుదుర్చుకొన్న మార్గదర్శక సూత్రాల ఒడంబడిక ఆధారంగా ఏర్పడ్డదే NSG. భారత్, అమెరికా అణు ఒప్పందం జరిగిన తర్వాత అమెరికాలాగే ఇతర NSG సభ్య దేశాలు భారత్‌కు అణు ఇంధన సరఫరాను చేసేందుకు, ఆయా సభ్య దేశాలు అమల్లో ఉన్న నియంత్రణలను సడలించాలంటే... NSGతో భారత్ ఫలప్రదమైన చర్చలు జరపాలి..